# హోటల్లో

★

త్రిపుర

ఉదయం ఎనిమిది. పైని చితచితగా వాన. లోపల తడి.

'మా పాప్ యిలాంటి వేషాలువేస్తే పాతేస్తానని రాశే డురా. బుద్ధిలేదు.'

'ముసలాళ్లందరూ అంతేరా. ఇ ఓల్డ్ హేగ్స్‌ని హిట్లర్ జ్యూస్‌ని మెసకర్ చేసినట్లు ఫైరింగ్ స్క్వాడ్‌ముందు పెట్టి టకటకమని షూట్‌చేసి పారేయాలి.'

ముందు ఖాళీ కప్పులు, పెదిమల చివర్ల సిగరెట్లు.

*　　*　　*

''ధర్మాబమ్స్'' చదివేరా ?

'పొన్లెద్దురూ. ఈ బీట్‌నిక్స్ మరీ రూట్‌లెస్ ఫెలోస్.

ఏంగ్రీయంగ్‌మెన్ నయమనిపిస్తోంది.'

కప్పుల్లో చల్లారుతున్న కాఫీ.

*　　*　　*

'యెదవనాయాల. పదిరూపాయ లిస్తేగాని ఫైలు ముట్టుకోడాని కీలులేదన్నాడు. మళ్లీ చూస్తే కుర్రకుంక. ఆ యెదవ మొగాన్ని ఆ పదీ కొట్టి, సంతక మెట్టించుగొచ్చా. ఏం జేస్తాం. సస్తామా.'

'ఈ కాలం యెదవలంతా యింతేనయ్యా. డబ్బు సేతిలో అడయ్యందే పని సెయ్యరు.'

టేబుల్‌మీద ఖాళీచేసిన యిడ్లీ ప్లేట్లు. మొదటా యన జేబులో చుట్టకోసం తణుముడు.

*　　*　　*

ఒకమూల, దిబ్బగా, టొమాటోలాగ ఎర్రటి ముఖం కుర్రాడు నాలుగిడ్లీల ప్లేటు తింటున్నాడు అటూ యిటూ చూడకుండా.

*　　*　　*

'సరోజినమ్మగారు రెండు రవ్వ దోసెలు పొట్లాం కట్టిం చుకు రమ్మన్నారండి. ఆళ్లబ్బాయి యిటొచ్చినప్పుడు డబ్బు లంపిస్తారంట.'

'రెండు రవదోశా పార్సేల్.... '' నంబుదిరి కేక.

*　　*　　*

'ఏమిటోయ్, హనుమంతూ. ప్రమోషన్ వచ్చిన తరువాత పార్టీ యివ్వకపోవడమే కాకుండా ఒక్కడివీ అలా బాంబర్‌లాగ కూచుని మేసేస్తున్నావ్.''

కుర్చీ బరబర వెనక్కి లాగి, పారల్లాంటి పళ్లు విశాలంగా విప్పి, గుర్రంలాగ సకిలింపు నవ్వు నవ్వేడు వెంకట్రావ్. గతుక్కుమన్న హనుమంతరావ్—ఉల్లిదోసెలోని అడపా దడపా దంతాలమధ్య పడే ఉల్లి ముక్కల్ని ఒక్కడూ సావకాశంగా అనుభవిస్తున్న హనుమంతరావ్—'యీ వెధవ ఎప్పుడూ యింతే' అనుకుంటూ, పులి కోఱల్లాంటి తన పళ్లు కూడా విప్పి,

'రావోయ్, ఏమిటి శాశ్వతం. ఏదీ యిప్పుడే' అని ''ఒక ఉల్లిదోసె ఎక్స్‌ట్రా, మణీ, మా బ్రదర్‌కి' అన్నాడు.

*　　*　　*

'క్రాఫర్డ్ దొరని పట్టి మెల్లగా తోసేసేను నా ఎల్డెస్ట్ సన్‌వి కంట్రోలర్‌గా. ఆ కాలం వేరు. ఇంగ్లీషువాళ్ల తరహాయే వేరు. 'వాటీస్ యువర్ బాయ్ డూయింగ్, మేన్' అని అడిగేడు. 'హి యీస్ మెట్రిక్ సార్' అన్నాను. 'వై డోంట్‌యూ పుష్ హిమ్ యిన్ టూ అవర్ బ్లడీ రైల్వేస్, మేన్' అన్నాడు.మర్నాడే ఆర్డరూ. రెండోవాడిది పెద్ద బుర్రలే. ఎమ్మెస్సీ చేసి ఎటామిక్ ఎనర్జీ కమీషన్‌లో ఉన్నాడు. బొంబాయి. థర్డ్ ఫెలోవే కొంచెం అల్లర పెడుతున్నాడోయ్. వెధవ, కమ్యూనిస్టులతో చేరి జండాలూ అవీ పట్టుకు తిరుగుతాడు. పాడుస్తాం, నరుకుతాం అని ఏమిటో పాటలూ .... అవేమీ ఒద్దులే. ఉత్త కాఫీ చాలు. అరగవు. ఆ తిండే పడిపోయింది.'

*　　*　　*

నములుతున్న ముఖాలు.
గానుగలాగే
ఎద్దుల్లా
మెల్లగా .....

'ఇమేజ్ దొరకడంలేదు. ఫీలింగ్‌కీ థాట్‌కీ డిపోసియేషన్ అవడంలేదు. ఇవాళ పొయిటిక్ వెదర్ లేదు.' అనుకున్నాడు భాస్కర్రావ్ ఖాళీ కాఫీకప్‌లో సిగరెట్ ఏష్ విదులుపుతూ.

*　　*　　*

'శివాజీగాడు ఛాన్సు యివ్వడంలేదురా. ఎబ్డైన్ టోర్న మెంటులో ముప్ఫయినాలుగు కొట్టేను పచ్చయ్యప్పాస్‌మీద. టాప్‌స్కోర్. యూనివర్సిటీమీద త్రీ ఫర్ ఫార్టీ సెవెన్యూ. ఆల్ రౌండర్ల ఖర్చర్లేకపోతే పామ్మను. రేపు రావ్‌జీకి సెల క్టయితే గీర అణగిపోతుందిలే'

*　　　*　　　*

'ఆరునెల్లాయి తిరుగుతున్నాను కాళ్లరిగేలాగ ఈ ఎంప్లాయ్ మెంట్ ఎక్స్‌ఛేంజ్ చుట్టూ. రిన్యూ చేయించుకోడమే గాని యింటర్వ్యూకేనా పిలిచిన గాడ్దెవడూ కనిపించడంలేదు. ఒక్క సారి కాబోలు పిలిచేరు షిప్‌యార్డ్‌కి. ఒక్క క్వశ్చన్‌కి జవాబు చెప్పలేక పోయానంటే నమ్ము. అసలు మొట్టమొదటే, ఇంగ్లీ షులో నీపేరేమిటని అడిగితే వాడేమిటన్నాడో బోధపడక తిక మక పడిపోయా ననుకో..... రిక్షా డబ్బులు దండగ.'

*　　　*　　　*

'మా పాప్ అంతేరా. లాస్ట్ యియర్ సమ్మర్‌లో ఆలిం డియా ఎక్స్‌కర్షన్ వెళ్లాలి, సిక్సు హండ్రడ్ వైరు చెయ్యమని వైరిస్తే 'రిటర్న్ యిమీడియేట్లీ' అని కొట్టేడు. అమాత్రం కామన్‌సెన్సుండొద్దూ.'

'సరేగాని, యీ టెరిలీన్ పేంట్ చూశావా. ఆరు లూప్‌లు పెట్టమని ఖచ్చితంగా చెప్తే నాలుగే పెట్టి కూచున్నాడు సన్నాసిగాడు. మళ్లీ మాస్టర్ కట్టర్ అని పెద్ద బోర్డూ పీడూనూ.'

*　　　*　　　*

టర్నిప్‌లా ఉన్న, టొమాటో ముఖం దిబ్బబ్బాయి ఇడ్లీల ప్లేటు పక్కకి నెట్టి, ఒరిగిన తిమింగలంలాగ ప్లేటుమీద పడి ఉన్న మసాలాదోసెని చిత్రవధ చెయ్యడం మొదలుపెట్టేడు.

*　　　*　　　*

'ఇవాళ మాటినీ ఏమిట్రా.'

'బర్ట్ లంకాస్టర్, సోఫియా లోరెన్. టైటిల్ జ్ఞాపకం లేదు.'

'కమాన్, లెటజ్ గో.'

'రైటో, బాస్.'

*　　　*　　　*

"మూడు కేచ్‌లు మిస్సయ్యేడు. మళ్లీ పెద్ద కబుర్లు."

"తాసిల్దారు దగ్గరికి వెళ్లడమంటేనే పెద్ద ఎడ్వెంచరూ వెధవకి."

"మావాడూ రైల్వేలోనే. కావీ ఫిట్టరు. రెండోవాడు కూడా. కాని వాడు ఖరగ్‌పూర్‌లో."

"ఇల్లు దొరక్క సస్తున్నా మనుకోండి."

"లెప్పర్స్సా, బెగ్గర్స్సా."

"డీసెంట్ జాబ్‌లురా. క్వార్టర్స్సూ, ఫ్రిజ్, ఓ."

"కెరువా అక్ 'ఆన్ ది రోడ్' చదివేరా ?"

"లంచాలు మీద లంచాలు గుంజి అఫీసనల్ కాల్నీలో ఇల్లు కట్టించేసేడంట."

"రాత్రికి రాత్రి మోసుకొచ్చేమండి టాక్సీలో చిట్టివలస నుంచి. అప్పటికప్పుడు ఆపరేషన్ చేశారు. కాని .... కాని ఆశ లేదు."

"షప్ఫాస్. పెద్ద డాబులా నువ్వున్నూ."

"ఒరే, ఇందులో రేలంగున్నాడూ."

*　　　*　　　*

మాంచి సారవంతమైన నేలలో పెరిగిన బీట్‌రూట్‌లా ఉన్న దిబ్బ కుర్రాడు దోసెని తినేసి, అప్పుడే సర్వర్ టేబుల్‌మీద పెట్టిన పెసరట్‌ని ముదిరిన బెండకాయల్లాంటి వేళ్లతో అప్యాయంగా నిమురుతున్నాడు, మేకని నరకబోయే కసాయి వాడిలా—

*　　　*　　　*

సరోజినమ్మగారికి కావలసిన దోసెలకోసం వచ్చిన రాములు చుట్టూ ఖాళీ కళ్లతో చూస్తూంది. ఇంట్లో—తన గుడిసెలో చిన్న కొడుకు సింహం చలంకి మందెవరు తెస్తారు.

*　　　*　　　*

మెత్తగా వల్లగా చుంచులాంటి ముఖాలు. రహస్యంగా నక్కలాంటి ముఖాలు. అప్పుడే చంపిన గేదెని చీలుతున్న పులి ముఖాలు. దుమ్ములగుండు ముఖాలు. బెదిరిన కుందేలు ముఖాలు. సన్నంగా పగగా పాము ముఖాలు. మార్కోవిచ్ సిగరెట్ పాకెట్‌మీద ముఖంలాంటి ముఖాలు. డిటెక్టివ్ ముఖాలు. దొంగ ముఖాలు.

*　　　*　　　*

ఉదయం తొమ్మిదీ నలభయి. పైన చిటచిటగా వాన. లోపల తడి, ఉక్క.